క్లుప్తంగా

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

• ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


ప్రభుత్వ విప్‌ను సన్మానిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

వేములవాడ: నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. వేములవాడలోని బద్దిపోచమ్మ వీధి ముదిరాజ్ సంఘం సభ్యులు చెక్కపల్లి రోడ్డులో పెద్దమ్మ ఆలయ ఆవరణలో ఆయన శుక్రవారం సన్మానించారు. అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ప్రభుత్వం ముదిరాజ్‌లకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయగా ధన్యవాదాలు తెలిపారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ బింగి మహేశ్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, ముదిరాజ్‌లు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న 'ఆది'

చందుర్తి: విందులో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ శుక్రవారం పాల్గొన్నారు. ప్రభుత్వ విప్ వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు నాగం కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు చింతకుంట రామస్వామి, కోనరావుపేట పార్టీ మండల అధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌ఖాన్, నాయకులు పులి సత్తయ్య, గొట్టె ప్రభాకర్, వెల్పుల దేవస్వామి, ముస్లింలు సలీం, బాబు, హైమద్, ఆజీమ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు


కేకే మహేందర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

సిరిసిల్ల: సిరిసిల్ల నూలు వ్యాపారసంఘం అధ్యక్షుడు పిస్క మధు, మాజీ కౌన్సిలర్ వెంగల లక్ష్మీనర్సయ్య, నాయకులు మ్యాన భాస్కర్ శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి సమక్షంలో సిరిసిల్లలో జరిగిన కార్యక్రమంలో పార్టీ కండువా కప్పుకున్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

సిరిసిల్లఎడ్యుకేషన్: పట్టణంలోని నెహ్రూనగర్ జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు నాగుల భాగ్యరేఖ ఆధ్వర్యంలో పాఠశాల క్యాచ్‌మెంట్ ఏరియాలోని ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు డిజిటల్ క్విజ్ కాంపిటీషన్స్ నిర్వహించారు. తెలుగు, ఆంగ్లం, గణితం, పరిసరాల విజ్ఞానం, జనరల్ నాలెడ్జ్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ – పిక్చర్ రౌండ్‌లో జాతీయ నాయకులు జనరల్ సైన్స్‌పై కాంపిటీషన్స్ నిర్వహించారు. ఎంపీపీ ఎస్ నెహ్రూ నగర్ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలవగా రూ. వెయ్యి నగదు, ద్వితీయ స్థానంలో ఎంపీపీ ఎస్ బీవైనగర్ విద్యార్థులకు రూ. 800, ఎంపీపీ ఎస్ గోపాల్‌నగర్ విద్యార్థులు తృతీయ స్థానంలో నిలవగా రూ.500 నగదు ప్రోత్సాహకాన్ని అందించారు. విద్యార్థులను జిల్లా విద్యాధికారి రమేశ్ అభినందించారు. అంతకుముందు మండల విద్యాధికారి దూస రఘుపతి గారు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు మోతీలాల్ ప్రారంభించారు. పాఠశాల ఉపాధ్యాయులు సలావుద్దీన్, అడుప కీర్తికి డీఈవో అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సెక్టోరల్ ఆఫీసర్ శ్రీధర్, ఉపాధ్యాయులు రోమాల లచ్చయ్య, ద్యావనపల్లి పరమేశ్ గుత్తికొండ రాజశేఖర్, గన్నమనేని శ్రీనివాసరావు కోడం భారతి, రాచర్ల వెంకన్న , చిమ్మని సువర్ణ, రజిత, హరిప్రసాద్ మామిండ్ల వేణు, మాధవి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని ధర్మారం శివారులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. కొడిమ్యాల మండలం నల్లగొండకు చెందిన రాములు బతుకుదెరువు కోసం మల్కపేటకు వచ్చి బావుల్లో పూడికతీసే పనులు చేస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం సామగ్రి కోసం సిరిసిల్లకు వెళ్తుండగా తంగళ్లపల్లి మండలం అంకిరెడ్డిపల్లికి చెందిన చంద్రయ్య ఎదురుగా వస్తున్నాడు. ధర్మారం శివారులో రెండు బైక్‌లు ఢీకొనడంతో రాములు కాలు విరిగింది. చంద్రయ్య తలకు గాయాలయ్యాయి. గ్రామస్తులు వెంటనే 108 అంబులెన్స్‌లో సిరిసిల్లలోని జిల్లా ఆస్పత్రికి తరలించారు.

రాచర్ల తిమ్మాపూర్ శివారులో మరో ఇద్దరికి ..

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్ల తిమ్మాపూర్ గ్రామ శివారులో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం సోమారిపేటకు చెందిన నార్ల వినయ్, రమేశ్ ద్విచక్రవాహనంపై ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్స కోసం వచ్చారు. తిరుగు ప్రయాణంలో రాచర్ల తిమ్మాపూర్ సమీపంలో కుక్కలు అడ్డు రావడంతో అదుపు తప్పి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో రమేశ్ తలకు తీవ్రగాయాలుకాగా పరిస్థితి విషమంగా ఉంది. ఇద్దరిని ఓ ప్రైవేట్ వాహనంలో సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ముక్కు మూసుకునుడే!

• ప్రధాన రహదారిపై నిలుస్తున్న మురుగునీరు
• ఇబ్బందిపడుతున్న స్థానికులు
• అధికారులకు విన్నవించినా పట్టింపు కరువు


తిప్పాపూర్‌లోని ప్రధాన రహదారి పక్కన నిలిచిన మురుగునీరు

వేములవాడఅర్బన్: నిత్యం జనరద్దీ ఉండే ప్రాంతంలో ముక్కుపుటాలు అదిరేలా దుర్వాసన వస్తోంది. డ్రెయినేజీ నీరు రోడ్డుపై ప్రవహిస్తుండడంతో ఆ ప్రాంతంలో నిల్చునేందుకు సైతం ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మురుగుకాలువలు సక్రమంగా లేక మురుగునీరు కాలువల్లో నిండి.. రహదారిపైకి వస్తుండడంతో వేములవాడ విలీన గ్రామాల్లోని జనం ఇబ్బంది పడుతున్నారు.

కంపుకొడుతున్న ప్రధాన రహదారి

వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లోని వేములవాడ–సిరిసిల్ల ప్రధాన రహదారిలోని ఏరియా ఆస్పత్రి ఎదుట డ్రెయినేజీ నిండి మురికినీరు రోడ్డుపైన ప్రవహిస్తుంది. దీంతో ప్రధాన రహదారిపై వెళ్లే వాహనదారులు, ఎదురుగా ప్రభుత్వ ఆస్పత్రి ఉండడంతో ఆస్పత్రిలో జనాలు, ఎదురుగా ఉండే హోటళ్లు, పక్కన ఉన్న ఇళ్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తెల్లారి లేస్తే మురికి కంపు, దోమలతో ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలకు పదిహేను రోజులు ఈ మురికినీరు రోడ్డుపై ఆగడంతో స్థానికులు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. మున్సిపల్ అధికారులు పట్టించుకుని మురుగుకాలువల్లో పేరుకుపోయిన మురుగును శుభ్రం చేయించాలని, అవసరమైతే మరో డ్రెయినేజీ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

నాంపల్లిలోనూ అధ్వానం

వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్, నాంపల్లిలో పండుగలు వస్తే తప్ప ఇళ్ల మధ్యలో ఉన్న మురికికాల్వలను శుభ్రం చేయడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. మురుగు కాలువల చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగాయి. మురుగుకాలువల్లో నీరు ఆగి కంపు కొడుతున్నాయని కాలనీవాసులు పేర్కొంటున్నారు. నాంపల్లి గ్రామపంచాయతీ చౌరస్తా వద్ద సిరిసిల్ల–కరీంనగర రహదారిలో ఇళ్ల నుంచి, హోటళ్ల నుంచి వచ్చే మురికినీరు రోడ్డుపై పారుతున్నాయి. ఈ మురికినీరు ఏళ్లుగా ఇలాగే పారుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు.

తెల్లారితే దుర్వాసన



డ్రెయినేజీలు నిండి మురుగు నీరు రోడ్డుపైకి వస్తుంది. తెల్లారితే ఇంటి ముందు మురికినీరు కనిపిస్తుంది. ఇంటి ముందుకు రావాలంటే కంపు భరించలేకపోతున్నాము. అధికారులు పట్టించుకుని మురుగు నీరు నిల్వకుండా చూడాలి.

– చంద్రకళ, తిప్పాపూర్

దోమలు పెరిగాయి



తిప్పాపూర్‌లోని ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి ముందు, ప్రధాన రహదారిపై మురుగునీరు పారి పరిసరాలు కంపు కొడుతున్నాయి. రాత్రి అయిందంటే దోమలు ఇళ్లలోకి వస్తున్నాయి. రోగాల బారిన పడుతామని భయంగా ఉంది. అధికారులు పట్టించుకోవాలి.

– గంగధర్, తిప్పాపూర్

కంపు కొడుతున్నాయి..



తిప్పాపూర్‌లో ఇళ్ల మధ్యలో ఎక్కడ చూసినా మురుగు కాలువలు శుభ్రంగా లేవు. దీంతో దుర్వాసన వస్తోంది. ఇరుకైన డ్రెయినేజీలు నిండి కంపుకొడుతున్నాయి. డ్రెయినేజీలను రెండు, మూడు నెలలకోసారి శుభ్రం చేస్తున్నారు.

– శ్రీకాంత్, తిప్పాపూర్

ప్రతీసారి నిండుతుంది



తిప్పాపూర్‌లోని ప్రధాన రహదారిపై ఉన్న డ్రెయినేజీ ప్రతీసారి నిండి రోడ్డుపైకి మురుగునీరు వస్తుంది. ప్రతీసారి అధికారులు వస్తుంటారు, చూసి వెళ్తున్నారు. కానీ పరిష్కరించడం లేదు.

– ఇన్నారెడ్డి, తిప్పాపూర్

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

• నేడు వేంకటేశ్వర స్వామి కల్యాణం



చందుర్తి: మండలంలోని బండపల్లి శ్రీ లక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు రెండ్రోజులుగా వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం జరిగే స్వామివారి కల్యాణ మహోత్సవానికి పుట్ట బంగారంను ఆలయ కమిటీ చైర్మన్ దంపతులు గడ్డం నాగరాణి లక్ష్మారెడ్డి, వేద పండితులు, భక్తులు శుక్రవారం పుట్ట బంగారం తీసుకొచ్చారు. స్వామివారి సన్నిధిలో విశ్వక్సేనారాధన, వాసుదేవా పుణ్యాహవచనం, రక్షాబంధనం, మృత్యంజాహణం, అంకురారోపణ, వైనతేయ ప్రతిష్ఠ, ధ్వజారోహణం, చతుస్నానార్చన, అగ్ని ప్రతిష్ఠ హోమం, పూర్ణాహుతి, అరగింపు, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టినట్లు ఆలయ ప్రధాన అర్చకులు కొదంగుల్లా శ్రీకాంతాచార్యులు వివరించారు.

నేడే స్వామివారి కల్యాణం

బండపల్లి శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో శనివారం ఉదయం 11.45 గంటలకు స్వామివారి కల్యాణం జరగనుంది. సుమారు రెండు వేలమంది భక్తులు రానున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు అంచనా వేస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు, తాగునీటి వసతి, అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు గడ్డం లక్ష్మారెడ్డి, ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు ఏనుగుల లచ్చిరెడ్డి పేర్కొన్నారు.

ముదిరాజ్ సంఘం ఫంక్షన్ హాల్ ప్రారంభం


పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఆగయ్య, ముదిరాజ్ సంఘం నాయకులు

గంభీరావుపేట: మండలకేంద్రంలో నూతనంగా నిర్మించిన ముదిరాజ్ సంఘం ఫంక్షన్ హాల్‌ను శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ముదిరాజ్ సంఘం గ్రామశాఖ అధ్యక్షుడు దండవేని లక్ష్మణ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పర్ష హన్మండ్లు, జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, మండల అధ్యక్షుడు చాత్రబోయిన లక్ష్మణ్, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ వెంకటస్వామి, జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్ గాడిచర్ల శ్రీనివాస్, చొక్కాల రాము, పిట్టల భూమేశ్, రమేశ్, దేవేందర్, శేఖర్, బాబు, ఆనందం, నర్సయ్య, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘన నివాళి



ముస్తాబాద్: మండలకేంద్రంలో శాలివాహన చక్రవర్తి జయంతి ఉత్సవాలను కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సంఘం బాధ్యులు మాట్లాడుతూ శాలివాహనుడి జయంతి ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలన్నారు. కుమ్మరుల కోసం ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు.

పంట నష్టంపై అధికారుల సర్వే


దమ్మన్నపేటలో సర్వే చేస్తున్న అధికారులు

గంభీరావుపేట(సిరిసిల్ల): పండించిన పంట చేతికందే సమయంలో కురిసిన అకాలవర్షం రైతులకు తీవ్ర నష్టం మిగిల్చింది. మండలంలోని పలుగ్రామాల్లో దాదాపు 93 ఎకరాల వరిపంటకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. వ్యవసాయ విస్తీర్ణాధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లి పంటనష్టాన్ని తెలుసుకునే పనిలో పడ్డారు. అకాలవర్షంతో నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.10వేలు నష్ట పరిహారం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. వ్యవసాయశాఖ అధికారులు పంటనష్టంపై సర్వేచేపట్టి నివేదికలు రూపొందించనున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 33శాతం కంటే ఎక్కువ పంటలకు నష్టం జరిగితేనే పరిహారం అందనుంది. అంతకంటే తక్కువగా నమోదైతే పరిహారం వచ్చే అవకాశం లేదు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ముస్తాబాద్: మండలంలో కురిసిన అకాలవర్షాలతో పంట నష్టపోయిన బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు మెరుగు అంజాగౌడ్ డిమాండ్ చేశారు. సర్వేల పేరుతో కాలయాపన చేయకుండా తక్షణమే రైతులకు పరిహారం ఇవ్వాలని కోరారు. శుక్రవారం అంజాగౌడ్ మాట్లాడుతూ యాసంగి సాగులో ఓవైపు సాగునీరు అందక, ఇబ్బంది పడుతున్న రైతులకు వడగండ్లు కడగండ్లను మిగిల్చాయన్నారు. పెట్టుబడులు కూడా రాని పరిస్థితి ఉందన్నారు. తక్షణమే ఎకరానికి రూ.25వేలు అందించాలని కోరారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ వేంకటేశ్వర్లు

చందుర్తి: శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలని సీఐ గాండ్ల వేంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. పార్లమెంటు ఎన్నికల్లో ముగిసే వరకు శాంతి భద్రతల పరిరక్షణకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. పాత నేరస్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. రౌడీషీటర్లు గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపుతామన్నారు. ఎస్సై సీహెచ్.శ్రీకాంత్, సిబ్బంది ఉన్నారు.

వడగళ్ల వానలు కురవద్దని నేడు ముడుపు

ఎల్లారెడ్డిపేట: రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం వడగళ్ల వర్షానికి దెబ్బతినొద్దని కోరుతూ..మండలకేంద్రంలోని రావి చెట్టు ఆంజనేయ స్వామికి ముడుపుకట్టాలని రైతులు శుక్రవారం నిర్ణయించారు. ఈ మేరకు మండలకేంద్రంలో రైతులు సమావేశమయ్యారు. రాళ్ల వాన పడకుండా ఏటా ఈ సీజన్‌లో రైతులు ముడుపు కట్టడం ఆనావాయితీగా వస్తోంది. ఈ ఏడాది ఈనెల 23న శనివారం ఉదయం ముడుపు కట్టేందుకు నిర్ణయించారు. అలాగే ఆదివారం రాత్రి కామదహనం, సోమవారం హోలీ వేడుకలు నిర్వహించాలని గ్రామంలో చాటింపు చేశారు. మాజీ ఎంపీటీసీలు నేవూరి రవీందర్‌రెడ్డి, ఒగ్గు బాల్‌రాజ్, రెడ్డి సంఘం మండల అధ్యక్షుడు గుండాడి వెంకట్‌రెడ్డి, రైతులు పారిపల్లి రాంరెడ్డి, యమగొండ కిష్టారెడ్డి, నాగుల ప్రదీప్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, శంకర్, లింగాల దాసు, లచ్చయ్య, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

అల్ప్రాజోలం పట్టివేత

సదాశివనగర్: కామారెడ్డి జిల్లా మండలంలోని పద్మాజీవాడి శివారులో గురువారం రూ.5లక్షల విలువ చేసే అల్ప్రాజోలం పట్టుకొని, నలుగురిని అరెస్టు చేసినట్లు సీఐ సంతోష్‌కుమార్ శుక్రవారం తెలిపారు. మాచారెడ్డి మండలం ఘన్‌పూర్‌కు చెందిన చేపూరి ప్రశాంత్‌గౌడ్, గంభీరావుపేట మండలం సీతారాంనగర్‌కు చెందిన పాపుగారి రాజు, సదాశివనగర్ మండలం పద్మాజీవాడి చౌరస్తాకు చెందిన బండమీది బాలాగౌడ్, కల్వరాల్‌కు చెందిన ఎండీ వాజీ రాజస్థాన్ నుంచి అల్ప్రాజోలం కొని, ఇక్కడికి సరఫరా చేస్తున్నారు. వీరికి రాజస్థాన్‌కు చెందిన భవానిసింగ్, ముఖేష్‌సింగ్ సరఫరా చేస్తున్నట్లు తెలిసింది. గురువారం పద్మాజీవాడి శివారులోని స్నేహ పౌల్ట్రీ ఫారం వద్ద అల్ప్రాజోలం డెలివరీ తీసుకుంటున్న ప్రశాంత్‌గౌడ్, రాజు, బాలాగౌడ్, వాజీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రెండు కార్లు, రెండు బైక్‌లు, ఐదు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను శుక్రవారం రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

ఎంపీడీవోకు ఫిర్యాదు


ఫిర్యాదు చేస్తున్న నాయకులు

గంభీరావుపేట: మండలకేంద్రంలో దోసలగూడెం కాలనీ శివారులో గతంలో నిర్మించిన పశువుల తొట్టిని కూల్చిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని మాల మహానాడు జిల్లా అధికార ప్రతినిధి పిట్ల రఘు, మండలశాఖ అధ్యక్షుడు లక్కబాబు శుక్రవారం ఎంపీడీవో రాజేందర్‌కు ఫిర్యాదు చేశారు. కొంతమంది తమ స్వార్థ ప్రయోజనాల కోసం తొట్టిని కూల్చేశారని, దీంతో పశువులకు నీరు దొరక్క తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తోందన్నారు. కూల్చివేసిన చోట పశువుల తొట్టి పునర్నిర్మాణం చేయాలని ఎంపీడీవోను కోరారు.

అభివృద్ధి, సంక్షేమం చూసే కాంగ్రెస్‌లోకి

• పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే. మహేందర్‌రెడ్డి
• కాంగ్రెస్‌లో మరో ముగ్గురు కౌన్సిలర్ల చేరిక


పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్లటౌన్: ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీకి నలుగురు కౌన్సిలర్లు రాజీనామా చేయగా మరో తాజాగా మరో కౌన్సిలర్ రాజీనామా చేసి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. వారంరోజుల క్రితం కౌన్సిలర్లు జాగీరు శైలు, కుడిక్యాల రవికుమార్, వేముల రవితో పాటు అర్బన్‌బ్యాంకు డైరెక్టర్ నేరెళ్ల శ్రీకాంత్‌గౌడ్ బీఆర్ఎస్‌ను వీడారు. శుక్రవారం అదే కోవలో స్థానిక ఏడోవార్డు కౌన్సిలర్ రెడ్యానాయక్ రాజీనామా చేశారు. కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి సమక్షంలో రెడ్యానాయక్, కుడిక్యాల రవికుమార్, వేముల రవి పార్టీలో చేరగా వారిని ఆహ్వానించారు. ఇటీవల ఐదుగురు కౌన్సిలర్లు పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడం చర్చనీయాంశమైంది. అభివృద్ధి, సంక్షేమం చూసే కాంగ్రెస్‌లో చేరుతున్నారని కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, గడ్డం నర్సయ్య, యెల్లె లక్ష్మీనారాయణ, వైద్య శివప్రసాద్, మ్యాన ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ఉమ్మడి మండల యాదవ సంఘం అధ్యక్షుడు, మాజీ ఏఎంసీ డైరెక్టర్ మెండె శ్రీనివాస్ శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల సంక్షేమం కోసం చేపడుతున్న అభివృద్ధిని చూసి పార్టీలో చేరినట్లు తెలిపారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి అలిగిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి గెలుపునకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్కే గౌస్, మందాటి దేవేందర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ద్రోహం చేసిన మాజీ మంత్రి కేటీఆర్



మాట్లాడుతున్న బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య

ఎల్లారెడ్డిపేట: సిరిసిల్ల నియోజకవర్గ రైతులకు మాజీ మంత్రి కేటీఆర్ ద్రోహం చేశారని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య విమర్శించారు. మండల కేంద్రంలోని పార్టీ ఆఫీస్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మల్కపేట రిజర్వాయర్ నుంచి 9వ ప్యాకేజీ కింద సింగసముద్రం, ఎగువమానేరుకు వచ్చే కెనాల్‌ను పూర్తి చేయక రైతుద్రోహిగా కేటీఆర్ మిగిలిపోయారన్నారు. మిడ్‌మానేరు నుంచి సిద్దిపేట గజ్వేల్ ప్రాంతాలకు 11, 12వ ప్యాకేజీలను పూర్తి చేసి నీటిని తీసుకెళ్లారన్నారు. సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్, గత ప్రభుత్వంలో మంత్రిగా ఉండి కూడా 9వ ప్యాకేజీపై శ్రద్ధ చూపలేదని విమర్శించారు. సుందిళ్ల, మేడిగడ్డ ప్రాజెక్టులలో పిల్లర్లు కుంగి బుంగలు పడి 60 టీఎంసీల నీరు సముద్రంలోకి వెళ్లిన విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పటికైనా ఈ ప్రాంత రైతులకు కేటీఆర్ క్షమాపణ చెప్పాలని కోరారు. పార్టీ మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు గంట బుచ్చాగౌడ్, చెన్ని బాబు, గుండాటి రాంరెడ్డి, ఎండీ రఫీక్, తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం


కోనరావుపేట: గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు


గంభీరావుపేట: అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోషి

కోనరావుపేట: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గంగలక్ష్మి అన్నారు. మండలకేంద్రంలోని రెండో అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ్ అభియాన్ భాగంగా పోషణ్ పక్వాడ నిర్వహించారు. ప్రీస్కూల్ పిల్లలకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం, గర్భిణులకు సీమంతం నిర్వహించారు. సూపర్‌వైజర్ మాట్లాడుతూ రక్తహీనతతో బాధపడకుండా ఉండేందుకు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. డీ హబ్ జనరల్ స్పెషలిస్ట్ దేవిక ఫైనాన్సియల్, లిటరసీ అధికారి రమ్య, అంగన్‌వాడీ టీచర్లు నర్మద, అరుణ, గర్భిణులు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి

గంభీరావుపేట: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ సంతోషి అన్నారు. మండలకేంద్రంలో పోషణ్ అభియాన్‌లో భాగంగా పౌష్టికాహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. పోషకాలతో కూడిన ఆహారం తీసుకుంటేనే చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న బాలామృతం, పోషకాహారాన్ని చిన్నారులు, గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు భాగ్య పాల్గొన్నారు.

వీర్నపల్లి : మండలంలోని రంగంపేటలో అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పౌష్టికాహారం, గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషిచేయాలి


విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు అందరు కృషిచేయాలని మాజీ సర్పంచ్ ముక్క శంకర్ అన్నారు. మండలంలోని రాజన్నపేటలో అంబేడ్కర్ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని గ్రామంలోని అన్ని కుల సంఘాల అధ్యక్షులతో కలిసి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ..అంబేడ్కర్ సంఘాల ఆధ్వర్యంలో విరాళాలు పోగు చేసి విగ్రహాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఎలక్షన్ అమలులో ఉన్నందున గ్రామస్తుల సమక్షంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించామన్నారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ వెంకట రమణారెడ్డి, అన్ని కుల సంఘాల ప్రతినిధులు, గ్రామస్తులు తెలిపారు.




ప్రమాదాలు జరుగుతున్నా పట్టింపేది?

చందుర్తి : మండలంలోని పలు గ్రామాల మూలమలుపుల వద్ద ఏర్పాటు చేసిన సూచిక బోర్డులపై రాతలు మలిగిపోయాయి. జోగాపూర్, కిష్టంపేట, రామరావుపల్లె, ననుగుల గ్రామాల మధ్య మూలమలుపులు, పాఠశాలల గేట్ల వద్ద ఏర్పాటు చేసిన సూచికబోర్డులన్నింటిపై రాతలు మలిగిపోయాయి. ఏళ్లు గడుస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో మూలమలుపులు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి సూచికబోర్డులపై పేర్లు రాయించి లేనిచోట బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.